క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థుల కోసం ఉచిత ఫిజియోథెరపీ సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: దివ్యాంగ విద్యార్థుల కోసం ఉచిత ఫిజియోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎమ్మార్సీ భవనంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలను డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అందించారు. ప్రతీ గురు, శుక్రవారాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, మండలంలోని 18 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, భవిత కేంద్రం కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల, వసతి గృహం ఆవరణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు నవత, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో వేణుగోపాల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన కళలు, సంస్కృతిని కాపాడుకోవాలి



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెంచికల్‌పేట్: ప్రాచీన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైఉందని కూచిపుడి కళామిత్ర డైరెక్టర్, నృత్యకళాకారిణి అమృత సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శివ ధనుర్భంగం భామకలాపం నృత్యాన్ని ప్రదర్శించారు. హెచ్ఎం విజయ నిర్మల మాట్లాడుతూ విద్యార్థుల్లో నృత్య కళల పట్ల ఆసక్తిని పెంచటానికి ప్రదర్శనలు తోడ్పడుతాయన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అమృత సింగ్‌ను ఘనంగా సన్మానించారు.

'పంచాయతీ నిధుల గోల్‌మాల్ జరగలేదు'



మాట్లాడుతున్న బండె తుకారాం

ఆసిఫాబాద్: వాంకిడి గ్రామ పంచాయతీ నిధుల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని వాంకిడి మాజీ సర్పంచ్ బండె తుకారాం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామపంచాయతీలో రూ.30 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, గ్రామ పంచాయతీలో ఖర్చులు నిబంధనల ప్రకారమే జరిగినట్లు తెలిపారు. తనపై వాంకిడి మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులు కావాలనే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సందీప్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

4న సన్నాహక సభ

కాగజ్‌నగర్‌రూరల్: పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించేందుకు ఆగస్టు 4న కాగజ్‌నగర్‌లో సింహగర్జన సన్నాహక జిల్లా సభ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మల్లేశ్, వీహెచ్‌పీహెచ్ జిల్లా అధ్యక్షుడు బన్నమూర్తి తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, నేత, గీత కార్మికుల పింఛన్ పెంచాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న సింహగర్జన సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జల్లంపల్లి శ్రీనివాస్, పిట్టల సత్యనారాయణ, శ్రీశైలం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు షురూ

- ఏళ్లుగా పెండింగ్‌లోనే..
- రూ. 11 కోట్లు మంజూరు
- వాహనదారుల హర్షం



రైల్వేస్టేషన్ -బస్టాండ్ రోడ్డుపై కొనసాగుతున్న మరమ్మతులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) పట్టణంలోని ప్రధాన రహదారులు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. కాగా కొద్ది రోజుల క్రితం రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు, సిర్పూర్(టి) -కౌటాల ప్రధాన రహదారిలో పూర్తిగా ధ్వంసమైన పేట్‌మహెలా కాలనీ నుంచి డౌనల్ వరకు రోడ్డుకు మరమ్మతులు ప్రారంభించారు.

2 కిలోమీటర్ల మేర పనులు..

పట్టణంలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.11 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. సిర్పూర్(టి) పట్టణంలో 1.5 కిలోమీటర్లు రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు, పేట్‌మహెలా, డౌనల్ ప్రాంతంలో 0.500 మీటర్లు రోడ్డు మొత్తం 2 కిలోమీటర్ల మేరకు మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఆయా రోడ్లకు మరమ్మతులు పూర్తయితే నియోజకవర్గ ప్రజలతో పాటు మహారాష్ట్రలోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

తీరనున్న కష్టాలు..



పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో రైల్వేస్టేషన్ రోడ్డుకు మరమ్మతులు పూర్తయితే వాహనదారులు, ప్రజల కష్టాలు తీరుతాయి. 15 ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాం. పనులు త్వరగా పూర్తి చేసి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

- కిర్మరే శ్యాంరావు, హుడ్కిలి, మం. సిర్పూర్ (టి)

పనుల్లో నాణ్యత ఉండాలి



రోడ్డు మరమ్మతులను నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలి. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- ఎల్ములే అశోక్‌ఆర్య, గంగాయిగూడ, మం. సిర్పూర్ (టి)

త్వరలో అందుబాటులోకి..

సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు, పేట్‌మహెలా, డౌనల్ ప్రాంతాలతో పాటు బెజ్జూర్ మండలంలోని రెబ్బెన గ్రామరోడ్డు మరమ్మతులకు రూ.11 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాం. త్వరలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

- క్రాంతి, ఆర్‌అండ్‌బీ ఏఈ

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనశాల పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని బలగల గ్రామంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల 1ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో కూడిన నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేయాలన్నారు. మంచినీటి ప్లాంట్‌ను పరిశీలించడంతో పాటు విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రిన్సిపాల్ రుమి ఫాతిమా, ఏపీవో చంద్రశేఖర్, కార్యదర్శి హరీశ్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో 400 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కనిక వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన



కోతకు గురైన కోయగూడ -యాపలగూడ రోడ్డు

కౌటాల: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వాగులు, చెరువులు ఉప్పొంగి ప్రవహించాయి. మండలంలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండడతో ప్రాణహిత నది వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు గ్రామాల్లో పత్తి చేలల్లో వరద నీరు చేరింది. మండలంలోని వార్ధా, వైన్‌గంగా, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రమోద్ సూచించారు. భారీ వర్షానికి కౌటాల మండలం గురుడుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కోయగూడ -యాపలగూడ రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటలు పరిశీలిస్తున్న ఏవో నాగరాజు

బెజ్జూర్: పత్తి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బెజ్జూర్ వ్యవసాయ అధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా అధిక వర్షాలతో పత్తి పంటకు గాలి, వెలుతురు అందక మొక్కలు వడలిపోయాయని తెలిపారు. క్రమంగా ఎండిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే రైతులు పంట చేలలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. పంట రక్షణ కోసం నానో యూరియా ఎకరానికి 500 ఎంఎల్ చొప్పున పంట ఆకులపై పడేలా పిచికారీ చేయాలని సూచించారు. లేకుంటే 19:19:19ను 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున కలిపి మొక్క మొదలు తడిచేలా స్ప్రేయర్ నాజీలు తీసి పిచికారీ చేసి పంటను కాపాడుకోవాలని వివరించారు.

'తెలంగాణ వాటా వదులుకునేదే లేదు'

నార్నూర్: గోదావరి నదిలో తెలంగాణ వాటాను వదులుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్టుపై అవగాహన కల్పించారు. ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి దోపిడీపై ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో సూర్యవంశీ, శేషు రాథోడ్, శివాజీ, బోస్లె సంతోష్, ఆడే సురేశ్, ఫెరోజ్ ఖాన్, జడే దయానంద్, విలాస్ పవార్ పాల్గొన్నారు.

ఆంగ్లభాష నైపుణ్యం పెంపొందించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గిరిజన బాలబాలికల్లో ఆంగ్లభాష నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆంగ్ల ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో యంగ్ లీడర్స్ క్లబ్ ముగింపు శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు.

మద్యం దుకాణం కోసం పెసా గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై శుక్రవారం పెసా గ్రామసభ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పెసా కమిటీ గ్రామపెద్దలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. త్వరలో మద్యం దుకాణాలకు వేలం నిర్వహించనున్న నేపథ్యంలో మండల కేంద్రంలో మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ గ్రామ పెద్దలకు సూచించారు. కాగా మద్యం దుకాణం ఏర్పాటుపై గ్రామ పెద్దలు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. ఎంపీవో సుధాకర్ రెడ్డి, ఎక్సైజ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, వీటీడీఏ అధ్యక్షుడు కంట్లం ఏమాజీ, ఉపాధ్యక్షుడు గాట్ల శంకర్, గ్రామ పెద్దలు మేకల ప్రసాద్, పూజారి కిష్టయ్య, ఎడ్ల రాజయ్య, మేకల పనేందర్, మేకల దస్రు, భగవాన్, డబ్బా మారయ్య, రొస్పెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో బురద తిప్పలు



చింతలమానెపల్లి: వారసంతలతో ఆదాయం వస్తున్నా అధికారులు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో వినియోగదారులు, వ్యాపారులు అనేక తిప్పలు పడుతున్నారు. రవీంద్రనగర్ వారసంతలో శుక్రవారం ప్రజలు బురదతో ఇబ్బందులు పడ్డారు. బురద వల్ల దుర్గంధం వ్యాపిస్తోందని, వ్యాపారాలు నిర్వహించడం కష్టంగా ఉందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారసంతలో సౌకర్యాలు కల్పించాలని, బురద తొలగించాలని కోరుతున్నారు.

షీటీంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: షీటీం యువతులు, మహిళలకు అండగా ఉంటుందని షీటీం సభ్యురాలు స్వప్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాబాపూర్ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో బాలికలకు షీటీం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే 100కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు రజిత, దినేష్, ప్రిన్సిపాల్ సుకన్య పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

చింతలమానెపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా 32 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారీ వర్షాలు మరి కొన్ని రోజులు ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉండాలని అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దౌలత్, జూనియర్ అసిస్టెంట్లు రావుల ప్రకాశ్, రేవాంజీ, నాయకులు ఎల్ములె మల్లయ్య, సుధాకర్, తిరుపతి, బాలాజీ, తుకారాం, పురుషోత్తం చారి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్‌అర్బన్: నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐ బుద్దె రవీందర్ అన్నారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో సీఐ బుద్దె రవీందర్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, 30 మంది సిబ్బందితో కలిసి కాలనీలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని సుమారు 40 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెస్సేజ్ లింక్‌లపై స్పందించొద్దని సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి



కూలర్‌లో నీటిని తొలగిస్తున్న కమిషనర్

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ అన్నారు. పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని సర్దార్‌బస్తీ, వార్డు నం.18లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు ఇంటి ఆవరణలోని నీటి తొట్టిలు, కూలర్లు, టబ్బుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆర్‌ఆర్‌వో కాలనీలోని కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిలిచి ఉన్న నీటిలో రసాయనిక బాల్స్‌ను వెదజల్లారు. దోమల లార్వా అభివృద్ధి కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. వీరి వెంట మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, రఫిక్, మెప్మా సిబ్బంది ఉన్నారు.



పిచ్చిమొక్కలు తొలగించరూ..!

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రావులవాడలో డ్రెయినేజీపై పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి ఏపుగా పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు చెత్తాచెదారం తొలగించి, డ్రెయినేజీ శుభ్రం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

'కేంద్రం నిధులతోనే గ్రామాలాభివృద్ధి'



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గోలేటి పంచాయతీ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 6 గ్యారెంటీలు 420 హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో పంచాయతీలకు ఒక్కపైసా కూడ విడుదల చేయలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని, గ్రామాలాభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ అధ్యక్షుడు దుర్గం వసంత్‌రావు, ఎర్ర రాజేశ్, మండల ఉపాధ్యక్షులు పద్మ, ప్రకాశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నార్నూర్: పోషణ్ చర్చ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో గంగాసింగ్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? జీసీసీ నుంచి సరకులు సరఫరా అవుతుందా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా అవసరం ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎంపీవో సాయిప్రసాద్, పాఠశాల ప్రిన్స్‌పాల్ అంజనేయులు, వార్డెన్ రాథోడ్ అశోక్, పీఈటీలు గుగ్లోత్ రాంచందర్ ఉన్నారు.

'సమస్యలు రాకుండా చూడాలి'

ఇంద్రవెల్లి: ఈనెల 29న కేస్లాపూర్ నాగోబా ఆలయంలో నిర్వహించే నాగుల పంచమి పూజలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయానికి సందర్శించారు. గ్రామ కమిటీ, మెస్రం వంశీయులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.